క్లుప్తంగా

మహిళలకు ఆర్థిక ప్రోత్సాహం



మాట్లాడుతున్న గోపాలకృష్ణ

గోపాలపట్నం: నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధులు మంగళవారం విడుదల కానున్నాయని క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆయన ఇంటి వద్ద మహిళలతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మీద నిలబడుతూ మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారన్నారు. వార్డు పరిధిలో నాలుగు విడతల్లో మొత్తంగా పది కోట్లు విడుదల చేశారని తెలిపారు. మహిళలు ఆ నిధుల్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. సమావేశంలో పీపీసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, చరణ్, విజయ్ సంతోష్, చిన్ని అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వీధి దీపాల మరమ్మతులు



వీధి దీపాలు వేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రహదారిలో వెలగని వీధి దీపాలకు జీవీఎంసీ విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. వేపగుంట నుంచి ఎన్ఏడీ వరకు పని చేయని వాటిని మార్చి కొత్తవి వేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విశాఖ చేరుకున్న షర్మిల



విమానాశ్రయంలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న షర్మిల

గోపాలపట్నం: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విశాఖ చేరుకున్నారు. పీసీసీ అధ్యక్షురాలిగా తొలిసారి సోమవారం సాయంత్రం విశాఖ వచ్చిన ఆమెకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మాజీ పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 31 వరకు రాష్ట్రంలో తొలి విడత పర్యటలో భాగంగా షర్మిల విశాఖ వచ్చారని చెప్పారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

మల్కాపురం: తల్లిదండ్రులు మందలించారన్న కారణంతో ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద దొడ్డి బాబూజీ భార్య, కుమార్తె, కుమారుడితో కొద్దికాలంగా నివసిస్తున్నారు. ఆయన కుమార్తె (16) స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. బాలిక తరచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో ఈ నెల 21న సాయంత్రం బాలిక బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా, ఆమె సోదరుడు అడ్డుకుని తల్లికి చెప్పడంతో ఆమె మందలించారు. దీంతో బాలిక గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. సోమవారం ఉదయం 8 గంటలు అయినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు తలుపు పైభాగంలో అద్దం పగలకొట్టి చూడగా, గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. వారు వెంటనే గాజువాక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి, బాలిక మృతిపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాజువాక సీఐ లంకా భాస్కర రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతా.. రామమయం

- బాలరాముడి ప్రతిష్టను వీక్షించి పులకించిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- మార్మోగిన జై శ్రీరామ్ నినాదం
- పలు చోట్ల ప్రసాదాల వితరణ



విమాన్‌నగర్‌లో రామయ్యకు పట్టాభిషేకం జరిపిస్తున్న వేదపండితులు



శ్రీరామ అక్షరాకృతిలో లక్కీ అమర్ పాఠశాల విద్యార్థులు

విశాఖ విద్య: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట జరిగిన వేళ...లోకమంతా జై శ్రీరామ్ అనే నినాదం మార్మోగింది. చారిత్రక ఘట్టాన్ని కనులారా వీక్షించి ప్రజలు పరవశించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారామలక్ష్మణ సమేతంగా ఉత్సవ మూర్తులకు వైభోవోపేతంగా పట్టాభిషేక క్రతువు జరిపించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల రామనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. నియోజకవర్గం అంతటా ఆధ్యాత్మిక సందడి కనిపించింది.

- 90వ వార్డు విమాన్‌నగర్ శ్రీవైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సీతారామలక్ష్మణ సమేత ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం జరిపించారు. స్వామివారి మూర్తులను ప్రత్యేక వేదికపై ఉంచి పట్టాభిషేకం జరిపించారు. పలిశెట్టి రాజు, చంద్రావతి, విమాన్‌నగర్ కాలనీ అసోసియేషన్ కార్యదర్శి పలిశెట్టి నాగు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయ వద్ద 3,300 దీపాలను రామబాణం ఆకారంలో వెలిగించారు.
- సుసర్ల కాలనీ, సీతారామరాజునగర్‌లోని పార్వతీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం జరిపించారు.



స్వామి వారి ఉత్సవ మూర్తులు

ఆలయ అధ్యక్షులు ఇచ్ఛారపు నాగేంద్ర, కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, కోశాధికారి సూర్యనారాయణ, సభ్యులు రాజు, హరి శంకర్, తిరుపతి రాజు, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

- గవరవీధి రామాలయం వద్ద ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి సీతారాముల వారికి పట్టాభిషేకం జరిపించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రమేష్ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. భారీ స్క్రీన్‌పై అయోధ్యలో జరిగిన వేడుకను తిలకించేలా ఏర్పాట్లు చేశారు.
- 52వ వార్డు కరాసలోని సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుజరాతీ పటేల్స్ సామాజిక వర్గ సభ్యులు ఎన్ఏడీ సెంటర్ ఉమియా భవన్ నుంచి కరసా రామాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ర్యాలీలో పాల్గొన్నారు.

కనులారా వీక్షించి..

మల్కాపురం: అయోధ్య రామమందిరంలో బాల రాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా 58వ వార్డు నక్కవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో సీతారాముల విగ్రహాలను నెలకొల్పి విద్యార్థులతో పూజలు చేయించారు. టీవీ ద్వారా విద్యార్థులు తిలకించే ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు సీతా రాముడు, లక్ష్మణుడు,హనుమాన్‌ల వేషధారణల్లో ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది.



62వ వార్డులో జ్యోతులతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

ఆధ్యాత్మిక ఝరి

గోపాలపట్నం: జీవీఎంసీ 91, 92, 89వ వార్డుల్లోని రామమాలయాల్లో శ్రీరామ నామం మార్మోగింది. పలు చోట్ల లైవ్‌స్క్రీన్లు పెట్టి అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులకు అందించారు. భక్తులు భజనలు, రామా నామాలను స్తుతిస్తూ భక్తి భావంతో ఉప్పొంగిపోయారు. గవరవీధి రామాలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు విశేష పూజలు చేశారు. సీతారాముల కల్యాణం నిర్వహించారు. బాజీ జంక్షన్ కోదండ రామాలయంలో సామూహిక క్షీరాభిషేకాలు, గోపాలపట్నం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

జగమంతా శ్రీరామనామస్మరణ

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని రామాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక భజనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వర్మ, తాతబాబు, బాబూరావు, సూరిసత్యం, శ్రీను, నూకరాజు, మోహన్, కిషోర్ పాల్గొన్నారు.

- జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో మహిళలు దీపాలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రామాలయంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు శ్రీరామ జెండాను ఆవిష్కరించి, ఊరేగింపును ప్రారంభించారు.

మార్మోగిన నామస్మరణ

మల్కాపురం: జింక్ గేట్ సమీపంలో గాజువాక వద్ద



సీతా, లక్ష్మణ, హనుమాన్ సమేత శ్రీరాముడి వేషధారణలో చిన్నారులు

రామ భక్తులు వేదిక ఏర్పాటు చేసి సీతారామ లక్ష్మణ సమేత హనుమాన్ విగ్రహాలు పెట్టి పూజలు చేశారు. రామ భక్తులు జై సీతారామ్ అంటూ కీర్తనలు ఆలపిస్తూ భజన చేశారు.

- జింక్ ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల విగ్రహాలకు పూజలు చేశారు.దేవతామూర్తులను దర్శించుకునేందు భక్తులు బారులు తీరారు. కార్యక్రమం అనంతరం యువత హనుమాన్,శ్రీరాముడి రూపంతో కూడిన కాషాయి జెండాలతో శ్రీహరిపురం వరకు యాత్ర సాగించారు.
- ఆర్‌కేపురం రామాలయం వద్ద సీతారాములకు పల్లకీ సేవ చేశారు.అలాగే ఇదే వార్డు వెంకన్నపాలెం శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు,భజనలు చేశారు. శ్రీహరిపురం హరి హర క్షేత్రం వద్ద , ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు.



కోదండ రామాలయంలో భజనలు చేస్తున్న భక్తులు



40వ వార్డులోని రామాలయంలో దీపాలంకరణలో పాల్గొన్న భక్తులు



అపార్ట్‌మెంట్ ఆవరణలో జై శ్రీరామ్ నినాదాలు చేస్తున్న భక్తులు



ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



విమాన్ నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



గవరవీధిలో జరిగిన వేడుకలో పాల్గొన్న భక్తులు



గవరవీధి రామాలయం వద్ద అన్నదానం



గవరవీధి రామాలయ ప్రాంగణంలో కల్యాణ క్రతువు



విమాన్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో భారీ శ్రీరాముని చిత్రంతో ఫ్లెక్సీ

శరవేగంగా కులగణన



వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది



60వ వార్డులో ..

విశాఖ విద్య: పశ్చిమ నియోజక వర్గంలో కులగణన శరవేగంగా జరుగుతుంది. 90వ వార్డు కాకానినగర్‌లో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుల గణన చేపట్టారు. గృహ యజమాని వివరాల ఆధారంగా వారి బయోమెట్రిక్ ధ్రువీకరణతో వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెల 28లోగా కులగణన ప్రక్రియ పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని సచివాలయ సిబ్బంది తెలిపారు.

59,60వ వార్డుల్లో..

మల్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణను సచివాలయ సిబ్బంది శరవేగంగా చేపడుతున్నారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. జీవీఎంసీ

- 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలోని సోమవారం సచివాలయ అధికారులు, వార్డు వలంటీర్లు కాలనీలో డోర్ టు డోర్ వెళ్లి వారి కుల వివరాలపై సర్వే చేపట్టారు.
- 60వ వార్డు ఇందిరాకాలనీ సచివాలయం పరిధిలో సచివాలయ సిబ్బంది, ఇంటింటికీ వెళ్లి వారి కుల వివరాలపై సర్వే చేపట్టారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆడారి హరీష్, సచివాలయ అడ్మిన్ సంతోష్,వెల్ఫేర్ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట

సింధియా: మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. డ్వాక్రా రుణ మాఫీ, వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, సున్నావడ్డీ, అమ్మ ఒడి వంటి పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తూ మహిళా సాధికారత దిశగా అడుగుల వేస్తోందని చెప్పారు. వార్డు పరిధిలోని డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ సొమ్మును ఆసరా పేరుతో సీఎం జగన్ క్రమం తప్పకుండా అందజేస్తున్నారని చెప్పారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు భీశెట్టి గణేష్, సీవో పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

గోపాలపట్నం: నెల్లూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఏడు కిలోల గంజాయి తరలిస్తుండగా గోపాలపట్నం రైల్వేట్రాక్ పక్క రోడ్డులో టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వివరాలు.. అరకు ప్రాంతంలో కొనుగోలు చేసిన గంజాయిని బ్యాగుల్లో నెల్లూరు తరలించేందుకు యత్నిస్తున్నారు. వీరు గోపాలపట్నం శ్మశాన వాటిక వెనుక రోడ్డులో వెళుతుండగా వచ్చిన పక్కా సమాచారంతో పట్టుకున్నారు. వారి నుంచి 7 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు ప్రాంతానికి చెందిన ఎస్. నవీన్, పి సురేష్‌గా గుర్తించారు. గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేల బావుల్లో గంబూషియా చేపల విడుదల



నేలబావిలోకి గంబూషియా చేపలను విడిచిపెడుతున్న కార్పొరేటర్ సురేష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పరిధిలోని నేల బావుల్లో గంబూషియా చేపలను విడిచిపెట్టారు. వార్డు మలేరియా విభాగ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పాల్గొని మలేరియా సిబ్బందితో కలిసి చేపలను నేల బావిలో విడిచి పెట్టారు. ఆయన మాట్లాడుతూ నేలబావిలో నాచు తిని గంబూషియా చేపలు జీవిస్తాయని,ఈ చేపలు దోమలను తిని వాటి వ్యాప్తిని అడ్డుకుంటాయని చెప్పారు. నీటిపై దోమలు అధికంగా గుడ్లు పెడతాయని.. వాటిని ఈ చేప తినడం వల్ల దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంత్‌రావు, ఆడారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు ఐదు వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ జోన్-8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం ఐదు వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు.

కనులపండువగా మరిడిమాంబ జాతర

మల్కాపురం: మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి జాతర (కాకి అప్పన్న పరస)మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయం వద్ద బారులు తీరారు. పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, స్థానిక నాయకులు పిలక రామ్మోహన్‌రెడ్డి, ఇండ్రస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఎమ్మెల్యే పి.గణబాబు, టీఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణరావు యాదవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జెయింట్‌వీల్, రంగులరాట్నాలు, డ్యాషింగ్ కార్లు తదితరాలు చిన్నారులను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం



మృతదేహం

గోపాలపట్నం: గోపాలపట్నం రైల్వే స్టేషన్, డీ కేబిన్ మధ్యలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృదేహాన్ని గవర్నమెంట్ రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 40 ఏళ్ల గల వ్యక్తి ట్రాక్‌పై మృతి చెంది ఉన్నాడు. అతడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. 5.5 అడుగుల ఎత్తుకలిగి, లేత నీలం రంగు టీషర్టు, నీలం రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి గుర్తించిన వారు ఎస్ఐ బాలాజీరావు 9666122 7222, సీఐ సీహెచ్ ధనుంజయనాయుడు 9440627547 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

మండల స్థాయి విజేతలకు అభినందనలు

కిట్ల బహూకరణ



క్రీడాకారులతో బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అభినందించారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో ఏపీడీ శ్రీరామ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు కిట్లు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన బెహరా మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

విజేతలు వీరే..

ఏపీడీ శ్రీరాం మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో క్రికెట్ పురుషుల విభాగంలో గోపాలపట్నం-3, బాలిక విభాగంలో బుచ్చిరాజుపాలెం-2, వాలీబాల్‌లో పురుషుల విభాగంలో బుచ్చిరాజుపాలెం-1, బాలికల విభాగంలో చంద్రనగర్ జట్లు గెలుపొందాయన్నారు. కబడ్డీలో పురుషుల విభాగంలో వెంకటాపురం-2, బాలికల కేటగిరిలో బుచ్చిరాజుపాలెం-1, ఖోఖోలో పురుషుల విభాగంలో యల్లపువానిపాలెం-2, బాలికల విభాగంలో యల్లపువానిపాలెం-2, బాడ్మింటన్‌లో పురుషుల విభాగంలో సుసర్ల కాలనీ-1, బాలికల విభాగంలో బాజీ జంక్షన్ జట్లు ఎంపికయ్యాయని తెలిపారు. వీరు నియోజకవర్గ స్థాయిలో గెలుపొందితే నగదు బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలకు మొదటి బహుమతి రూ.35వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.5000 ఉంటుందన్నారు. బ్యాడ్మింటన్‌లో మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.5వేలు అందుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గోపాలపట్నం పీడీ సత్యకళ, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, నమ్మి శ్రీనివాసరావు, గేదెల మురళీ కృష్ణ, ఊటపల్లి గోవిందు, నీలాపు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పశ్చిమ ఓటర్లు.. 2,06,943 మంది

- పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ
- వెల్లడించిన రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్

విశాఖ విద్య: విశాఖ పశ్చిమ నియోజక వర్గ ఓటరు జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ వెల్లడించారు. రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించిన ఆయన ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా తుది ఓటరు జాబితాను ప్రకటించారు. ఓటరు జాబితా వెల్లడిలో అవలంబించిన విధి, విధానాలను ఆయా పార్టీల నాయకులకు వివరించారు. నియోజకవర్గంలో మొత్తం 220 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,06,943 మంది ఓటర్లు ఉన్నట్లుగా ప్రకటించారు. వీరిలో పురుషులు 1,02,089 మంది, స్త్రీలు 1,04,844 మంది, థర్డ్ జండర్ 10 మంది ఉన్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలను నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లతో పాటు రాజకీయ పార్టీలకు కూడా అందజేస్తామన్నారు. ఓటర్లు జాబితాలో పేర్లు మరోమారు పరిశీలన చేసుకోవాలన్నారు. సమావేశంలో గోపాలపట్నం తహసీల్దార్ జయ, ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే ఎక్కువ

నియోజకవర్గంలో పురుషుల కంటే, మహిళా ఓటర్లు 2,785 మంది ఎక్కువగా ఉన్నారు. మొత్తం ప్రక్రియ అనంతరం నియోజకవర్గంలో 47,490 మంది కొత్తగా ఓటరు జాబితాలో నమోదు కాగా, 75,464 మందిని జాబితా నుంచి తొలగించారు.



రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

2019లో కంటే తగ్గిన 29,367 ఓటర్లు

2019 ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో 2,36,310 మంది ఓటర్లు ఉండగా, తాజాగా ప్రకటించిన 2024 ఎన్నికల ఓటరు జాబితా మేరకు 2,06,943 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చారు.

గత ఎన్నికల నాటి కంటే ఈ సారి 29,367 మంది తగ్గారు.